సాక్షి సంగారెడ్డి

శుక్రవారం। 23। ఫిబ్రవరి। 2024



జైకాతో సంబంధాలు..

జైకా చేపట్టిన కార్యక్రమాలతో భారత్–జపాన్ మధ్య సంబంధాలు బలపడ్డాయి. వివరాలు 8లో ▸



పాలకవర్గం ప్రశ్నార్థకం!

కోహీర్ మండలం బడంపేట శ్రీరాచన్న ఆలయ పాలకమండలి ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. వివరాలు 8లో ▸

27న సదరం శిబిరం

సంగారెడ్డి : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 27న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ గాయత్రీదేవి తెలిపారు. శిబిరానికి వచ్చేవారు 25న మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగ ఫొటో, అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

న్యూస్‌రీల్

పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

సంగారెడ్డి టౌన్ : పాలీసెట్(పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) 2024 కు ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతరులు రూ.500 చెల్లించాలన్నారు. [illegible] వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 24 వరకు రూ.100 అపరాధ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



పటాన్‌చెరు : టెలీ కమ్యూనికేషన్ రంగంలో 5జీ సాంకేతికతను అమలు చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్టార్టప్‌లను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డిలోని భారతీయ సంచార నిగం (బీఎస్ఎన్ఎల్) ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'హవానా' పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సాంకేతికోత్సవాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. గంగాధర్ గుడే, రామశాస్త్రి, డీవీవీఎస్ఆర్ వర్మ, దీపక్, అమూల్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం



సంస్థ ప్రతినిధులను సన్మానిస్తున్న హెచ్ఎం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ సంవత్సరం పీఆర్‌వైఎం గ్రూప్ సహకారంతో రోజ్(రూరల్ ఆర్గనైజేషన్ ఫర్ సొసైటీ ఎంపవర్‌మెంట్) సంస్థ ద్వారా విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందిస్తున్నామని జర్మన్ సీపీఓ డైటర్ వేరొఈవెన్ తెలిపారు. గురువారం మండల పరిధి ముత్తంగి ప్రభుత్వ పాఠశాలకు 10 కంప్యూటర్లు, 15 కుట్టు మిషన్లు అందించారు. వీటి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో రోజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు శేషయ్య, వైస్ ప్రెసిడెంట్ వైవీరావు, ప్రధానోపాధ్యాయురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సీఎస్ఆర్ నిధులు



చెక్కును అందిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధి గుండ్ల మాచినూరు గ్రామ శివారులోని కోవెంట్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలు పాఠశాల నిర్మాణానికి అందించినట్లు వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి గురువారం తెలిపారు. కంది మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న సరస్వతీ శిశు మందిర్ భవన నిర్మాణానికి వీటిని ఉపయోగించనున్నట్లు చెప్పారు. చెక్కును పాఠశాల కమిటీకి అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధి ఇస్నాపూర్ గ్రామంలోని కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, ఇస్నాపూర్ తాజా మాజీ సర్పంచ్ బాలమణి పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధి లక్ష్మీపతిగూడెం గ్రామంలో గురువారం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నేత మధుసూదన్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, కాటా శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, వడ్డె కృష్ణ పాల్గొని పూజలు చేశారు.



ఆలయంలో భక్తులు

ట్రబుల్ రైడింగ్

ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీసులు పదేపదే చెబుతున్నా యువత పెడ చెవిన పెడుతోంది. చలాన్లు వేసినా మేం మారం.. మేమింతే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలో ఒక్కో బైక్ మీద ముగ్గురు నలుగురు ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. హెల్మెట్ కూడా లేకుండా స్పీడ్‌గా దూసుకెళ్తూ యాక్సిడెంట్లకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి









పెంపు ఇంతేనా?

చెరుకు ఎఫ్ఆర్‌పీని టన్నుకు రూ.250 పెంచిన కేంద్రం

- టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్
- సాగు ఖర్చులు భారీగా పెరిగాయంటున్న రైతులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : చెరుకు ధర పెంపుపై రైతులు పెదవి విరుస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులకు తగ్గట్టుగా ధర పెరగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం చెరుకు ఎఫ్ఆర్‌పీ (ఫెయిర్ అండ్ రెమ్యునరేషన్ ప్రైస్)ను టన్నుకు రూ.250 పెంచి ధర రూ.3,400గా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కానీ చెరుకు సాగు ఖర్చులు భారీగా పెరిగాయి. ముఖ్యంగా చెరుకు కోత కోసం కూలీల ఖర్చు ఏటా సుమారు 30 శాతం పెరుగుతూ వస్తోంది. అలాగే ఫ్యాక్టరీలకు తరలించేందుకు రవాణా చార్జీలు కూడా ఏడాదికి ఏడాది పెరుగుతూ వస్తున్నాయి. పెరిగిన డీజిల్ ధరల కారణంగా వాహనాల కిరాయిలు భారీగా పెరుగుతున్నాయి. దూర ప్రాంతాల రైతులకు చెరుకును ఫ్యాక్టరీలకు తరలించడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనిగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రం పెంచిన ధర ఏమాత్రం సరిపోదని రైతులు చెబుతున్నారు. కనీసం టన్నుకు రూ.4వేలు ధర చెల్లిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

గతేడాది కంటే కాస్త ఎక్కువే..

గతేడాదితో పోల్చితే ఈసారి పెరుగుదల కాస్త ఎక్కువ ఉందని కేన్ కమిషనరేట్ అధికారులు పేర్కొంటున్నారు. 2023–24 పంట కాలంలో ఎఫ్ఆర్‌పీ టన్నుకు రూ.150 చొప్పున పెంచిందని అధికారులు చెబుతున్నారు. టన్నుకు రూ.3,000 నుంచి రూ.3150కు పెరిగింది. అయితే ఈసారి ధర రూ.3150 నుంచి రూ.3,400కు చేరింది. అయితే చెక్కర రికవరీ శాతాన్ని బట్టి ఈ ధరలో మార్పులు, చేర్పులుంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

చేతి కందేదీ తక్కువే..

జిల్లాలో ట్రైడెంట్, గణపతి షుగర్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 17వేల నుంచి 18 వేల ఎకరాల్లో చెరుకు పంట సాగవుతోంది. ప్రధానంగా జహీరాబాద్ ప్రాంతంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్, సంగారెడ్డి, హత్నూర, కంది తదితర మండలాల్లో చెరుకు ఎక్కువగా సాగు చేస్తుంటారు. పంట కాలం ఏడాది ఉంటుంది. చెరుకు కోత కోసం కూలీలు, ఫ్యాక్టరీకి తరలింపు రవాణా ఖర్చులన్నీ మినహాయిస్తే టన్నుకు రూ.2,500 నుంచి రూ.2,700 వరకు మాత్రమే చేతికందుతోందని రైతులు వాపోతున్నారు. ఏడాదంతా కష్టపడితే వచ్చే రాబడి ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు.

తక్కువ మిగులుతోంది



ఇతర పంటలకు సరైన ధర లభించకపోవడం వల్ల చెరకు పంటను సాగు చేస్తున్న. 13 ఎకరాల్లో పంట వేసిన. చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు అయ్యే ఖర్చులు, కటింగ్ చార్జీలు పోగా టన్నుకు కేవలం రూ.2,700 మిగులుతున్నాయి. మొత్తంగా ఎకరాకు రూ.20వేలు మాత్రమే చేతికొస్తుంది.

– తిరుపతిరెడ్డి, చెరుకు రైతు, మెటల్‌కుంట గ్రామం, న్యాల్‌కల్ మండలం

కటింగ్ చార్జీలు ఫ్యాక్టరీలే భరించాలి



ఇతర పంటలకు గిట్టుబాటు ధర లేక చెరుకు సాగు చేస్తున్నాం. పది ఎకరాలకు పైగా సాగు చేశా. పెట్టుబడులు, ఖర్చులు పెరిగినట్లు ధరనూ పెంచాలి. అలా చేస్తేనే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. టన్ను కనీసం రూ.మూడు వేలు చెల్లించి రవాణా, కట్టింగ్ చార్జీలు ఫ్యాక్టరీలే భరించాలి.

– తుక్కారెడ్డి, చెరుకు రైతు, మామిడ్గి గ్రామం, న్యాల్‌కల్ మండలం

19 మంది టీచర్లకు షోకాజ్

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో సమయపాలన పాటించని 19 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్, కోహీర్, ఝరాసంఘం, నారాయణఖేడ్, నాగల్ గిద్ద, అందోల్, రాయికోడ్, మునిపల్లి మండలాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. షోకాజ్ నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని తెలిపారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు డీఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాక్టర్ శ్రవణ్, డాక్టర్ మధులత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో పిల్లలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జ్వరం, కాలిన గాయాలు, విద్యుత్ షాక్, కుక్క, తేలు, పాటు కాటుకు అందించాల్సిన ప్రాథమిక చికిత్స గురించి వివరించారు.

చిట్‌ఫండ్ కేసులు పరిష్కరించండి

సంగారెడ్డి టౌన్ : చిట్‌ఫండ్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. గురువారం జిల్లా కోర్టులో చిట్‌ఫండ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో చిట్‌ఫండ్, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ల కేసులను పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం న్యాయవాదులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్ : జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో 100 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. టెన్త్, ఇంటర్, బీఫార్మసీ, డీఫార్మసీ, ఎంఫార్మసీ ఉత్తీర్ణులైనవారు అర్హులని చెప్పారు. జిల్లా ఉపాధి కార్యాలయం పాత వెలుగు కార్యాలయంలో జరిగే ఈ మేళాకు సకాలంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 08455–271010లో సంప్రదించాలని కోరారు.

సమస్యాత్మక కేంద్రాలను గుర్తించండి

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు ఎన్నికల మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితుల సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే సమయంలో జిల్లా స్థాయి నోడల్ అధికారులను సంప్రదించాలని చెప్పారు. గ్రామాలలో ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎండబ్ల్యూఓ దేవుజా, ఆర్డీఓలు రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, పాండు, జిల్లాస్థాయి ట్రైనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పకడ్బందీగా పది, ఇంటర్ పరీక్షలు..

పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు, టెన్త్ పరీక్షలు మార్చి18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాటు చేయాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు తావివ్వొద్దని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఈఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ గాయత్రి, ఆర్డీఓలు రవీందర్ రెడ్డి, రాజు, పాండు, విద్యుత్‌శాఖ టెక్నికల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎంవీ ఇన్‌స్పెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విజయ సంకల్పయాత్ర

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి విజ్ఞప్తి చేశారు. రాజరాజేశ్వర క్లస్టర్‌లో భాగంగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ యాత్ర ముగిసి నేడు (శుక్రవారం) సంగారెడ్డి జిల్లాలో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు, కేంద్ర నాయకత్వం కూడా పాల్గొంటుందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం లింగంపల్లి వద్ద జాతీయ నాయకులకు స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. రామచంద్రాపురం వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సభను నిర్వహిస్తామన్నారు. శనివారం పటాన్‌చెరులో రోడ్‌షోతో పాటు, పబ్లిక్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. అనంతరం కంది మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. సంగారెడ్డి పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మెదక్ జిల్లాలో ఈ యాత్ర ప్రవేశిస్తుందన్నారు. యాత్రలో బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పేద విద్యార్థులను ప్రోత్సహిద్దాం



మాట్లాడుతున్న మంజుశ్రీ

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

రామచంద్రాపురం(పటాన్ చెరు) : పట్టణంలోని గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యనందించాలని ఉద్దేశంతో మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి సొంత నిధులతో కార్పొరేట్ స్థాయిలో గీతా భూపాల్ రెడ్డి జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. 30 మందితో ప్రారంభమైన ఈ కళాశాల నేడు 1200 మంది వరకు విద్యార్థులు చదువుతూ ఉండడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని అన్నారు. కార్పొరేటర్లు పుష్ప, సింధు, మెట్టు కుమార్, యాదగిరి యాదవ్, తొంట అంజయ్య, గూడెం మధుసూదన్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఆదర్శ రెడ్డి, సీఐ నరేందర్ రెడ్డి, ఎస్సై శశికాంత్, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, విజయ్, పరమేష్ పాల్గొన్నారు.

పోస్టాఫీసులో సొమ్ము స్వాహా!

- సుమారు రూ.3లక్షల వరకు మోసం
- చేతివాటం చూపిన పోస్టు మాస్టర్
- 3 నెలలుగా విధులకు డుమ్మా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వెంకటాపూర్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తపాలా పొదుపు అంటే పేదోడి భవిష్యత్‌కు ఓ ఉత్తమ మార్గం. కష్టపడి సంపాదించిన సొమ్ములో కొంతమేర తపాలా శాఖలో దాచుకుంటే ఓ పోస్టల్ ఉద్యోగి ఖాతాదారులకు శఠ గోపం పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు తినీతినక రూపాయి రూపాయి కూడబెట్టి తపాలా కార్యాలయంలో కడితే బ్రాంచ్ పోస్టు మాస్టర్ చేతివాటం ప్రదర్శించాడు. దీంతో వృద్ధులు, మహిళలు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ డబ్బులను గ్రామంలోని పోస్టుఆఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నెలవారీ డిపాజిట్లు చేశారు. ఆ సొమ్ము ఒకేసారి తీసుకుంటే.. ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుందని అనుకున్న ఖాతాదారులకు పెద్ద షాక్ తగిలింది. ఆ సొమ్మునంతా బ్రాంచ్ పోస్టుమాస్టర్ కాజేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వందల మంది పోస్టు ఆఫీస్‌లో ఖాతా తెరిచారు. ప్రతి నెలా డబ్బులు దాచుకున్నారు. పొదుపు చేసే సమయంలో ప్రతి నెలా పుస్తకాల్లో డబ్బుల చెల్లింపు వివరాలు నమోదు చేసి ఖాతాదారులకు ఇవ్వాలి. కానీ పోస్టుమాస్టర్ పుస్తకాలు తనవద్దే ఉంచుకున్నాడు. డబ్బుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దాదాపుగా ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు ప్రజలు పొదుపు చేసిన సొమ్ము రూ.3లక్షల వరకు ఉంటుంది. ఆ డబ్బు అంతా పోస్టుమాస్టర్ స్వాహా చేసినట్లు తెలుస్తోంది. 3 నెలలుగా అతను విధులకు హాజరుకాకపోవడంతో ఖాతాదారులు పోస్టుఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. అలాగే ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా జరిపిన లావాదేవీలకు సంబంధించిన రూ.99వేలు పోస్ట్‌మాస్టర్ కార్యాలయంలో చెల్లించాల్సి ఉంది. దీంతో సదరు వ్యక్తిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు పడుతున్నారు. పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

బిడ్డ పెండ్లికని జమ చేశా..

నా బిడ్డ పెళ్లి కోసం అని పోస్టాఫీస్‌లో ఖాతా తెరిచి డబ్బు జమ చేశా. రూ.35వేలు డ్రా చేస్తే రూ.24వేలు ఇచ్చాడు. మిగతావి పోస్టుమాస్టర్ కాజేశాడని తెలిసింది. ఏంచేయాలో అర్థం కావడం లేదు.

– చిల్వేరి అనిత

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

వెంకటాపూర్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ చేతివాటం ప్రదర్శించినట్లు తమ దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. ఖాతాదారుల సొమ్ము తిరిగి వచ్చేలా కృషి చేస్తాం. శుక్రవారం ఉన్నతాధికారులను విచారణకు పంపుతామని పేర్కొన్నారు.

– మురళి కుమార్, పోస్టల్ శాఖ ఎస్పీ, సంగారెడ్డి జిల్లా

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మల్లారెడ్డి, తదితరులు

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో ఈనెల 25వ తేదీన జరగనున్న తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆవిష్కరించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. సభకు కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమాశంకర్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జైకాతో మెరుగైన సంబంధాలు

ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి



జపాన్ ప్రొఫెసర్లతో బీ.ఎస్.మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) చేపట్టిన కార్యక్రమాలతో భారత్–జపాన్ దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలు మెరుగుపడుతున్నాయని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి పేర్కొన్నారు. గురువారం ఐఐటీహెచ్‌లోని ఆడిటోరియంలో డిజైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ విద్యా సంస్థ ఐఐటీహెచ్, జైకాలు కలిసి డిజైన్ విభాగంలో నూతన ఆవిష్కరణలను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఐఐటీహెచ్‌లో పలు భవనాలను డిజైన్ చేసిన జపాన్‌కు చెందిన పలు ప్రముఖ యూని వర్సిటీల డిజైన్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హైడిటోషి హోనో, యోజోఫిజినో మాట్లాడారు.

డీఎస్పీకి సన్మానం

జహీరాబాద్: నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రెడ్డిని రేషన్ డీలర్ల సంఘం నాయకులు గురువారం కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం కొత్తగా వచ్చిన సీఐ రవి, ఎస్‌ఐ లక్ష్మారెడ్డిలను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు జి.విజేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సద్రుద్దీన్‌గౌరి, సంఘం నాయకులు మచ్చేందర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చేర్యాల, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆకునూరు శివారు రోల్లబండ సమీపంలో బొలెరో వాహనంతో రేషన్ బియ్యాన్ని తరలించి డంప్ చేసినట్లు సమాచారం వచ్చింది. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి బొలేరో వాహనంతోపాటు 12 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నాం. అలాగే నూనె శేఖర్, నల్లమల శ్రీధర్, కల్యాణపురం సిమిలర్ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పాలకవర్గం ప్రశ్నార్థకం!

- మండలి ఏర్పాటులో తీవ్ర జాప్యం
- 20 రోజుల్లో మల్లికార్జున స్వామి జాతర
- 13 ఆలయాల ఇన్‌చార్జి ఈఓతోనే కాలయాపన
- కుంటుపడుతున్న ఆలయ అభివృద్ధి

మండలంలోని బడంపేట గ్రామ శివారులో వెలిసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రకాళి సమేత శ్రీ రాచన్న స్వామి, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ పాలక మండలి నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత పాలక మండలి పదవీ కాలం ముగిసి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు కొత్త పాలక మండలి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయలేదు. దీంతో ఇన్‌చార్జి కార్యనిర్వాహణ అధికారితో కాలం వెళ్లదీస్తున్నారు. తద్వారా ఆశించిన మేరకు అభివృద్ధికి నోచుకోకపోగా స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు అసౌకర్యాలకు గురవుతున్నారు.

కోహీర్(జహీరాబాద్)



బడంపేటలో వెలిసిన భద్రకాళీ సమేత శ్రీరాచన్న స్వామి ఆలయం

పాలక మండలి నియామక ప్రక్రియలో దేవాదాయ ధర్మాదాయ శాఖ తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోంది. దీనికి తోడు రాజకీయ నాయకుల జోక్యం పాలక మండలి నియామకం మరింత జాప్యానికి కారణమవుతోంది. 12 ఏళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే పాలక మండలి పని చేసిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 11 సెప్టెంబర్ 2011న రాచయ్య స్వామి నేతృత్వంలో రెండేళ్ల పదవీ కాలం ముగిసిన తర్వాత పాలక మండలి పదవీ కాలం రెండేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. 2018 నుంచి 2019లో కనకరత్నం చైర్మన్ నేతృత్వంలోని పాలక మండల ఏడాదిపాటు, 2021 నుంచి 2022 వరకు రాజు స్వామి చైర్మన్‌గా మరో ఏడాది పాటు పాలక మండలి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. అనంతరం పాలక మండలి నియామకంలో జాప్యం జరుగుతోంది. మార్చిలో 14, 15, 16 తేదీల్లో ఆలయ వార్షిక జాతర నిర్వహించనున్న నేపథ్యంలో కనీసం జాతర ఉత్సవ కమిటీ ఏర్పాటుకు సైతం నోటిఫికేషన్ జారీ చేయలేదు. వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి పాలక మండలి నియామకం చేపట్టాల్సిన అవసరం ఉంది.

13 ఆలయాలకు ఒక్కరే ఇన్‌చార్జి..

ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వాహణ అధికారిగా శివరుద్రప్ప కొనసాగుతున్నారు. ఆయన చాంద్రాయణ గుట్ట చెన్నకేశ్వర ఆలయానికి పూర్తి కాలపు ఈఓగా కొనసాగుతున్నారు. అయితే సంగారెడ్డి జిల్లాలో ఐదు ఆలయాలకు, హైదరాబాద్ జిల్లాలో ఎనిమిది మొత్తం 13 ఆలయాల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఏ ఒక ఆలయానికి సరైన న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది.

వెంటనే నియమించాలి



బడంపేట శ్రీ రాచన్న స్వామి పాలక మండలి నియామకంలో జాప్యం జరుగుతోంది. హైదరాబాద్‌లోని చాంద్రాయణ గుట్ట చెన్నకేశ్వరస్వామి ఆలయానికి పూర్తి కాలపు ఈఓగా పని చేస్తున్నాను. మరో 13 ఆలయాలకు ఇన్‌చార్జి ఈఓగా కొనసాగుతున్నాను. సిబ్బంది సహకారంతో ఆలయాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నాను. పాలక మండలిని నియమిస్తేనే అభివృద్ధికి అవకాశం ఉంటుంది.


–శివరుద్రప్ప, ఇన్‌చార్జి ఈఓ

అభివృద్ధికి ఆమడదూరం..

పాలక మండలి ఏర్పాటు కాకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. ముఖ్యంగా రూ.3 కోట్లతో నిర్మించ తలపెట్టిన రాజగోపుర నిర్మాణం పెండింగ్‌లోనే ఉంది. ఆలయం చుట్టూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వార్షిక జాతర ఉత్సవాల్లో రథోత్సవం పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోతున్నారు. గోశాల ఏర్పాటు చేయలేదు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ధర్మసత్రాలు నిరుపయోగంగా మారాయి. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులకు విఘాతం కలుగుతోంది. పూర్తిస్థాయి కార్యనిర్వహణ అధికారిని, పాలక మండలిని నియమించి అభివృద్ధికి సహకరించాలని భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

శభాష్ శంకరాచారి

- విద్యార్థులకు ఉచితంగా సివిల్స్‌లో శిక్షణ
- తాను సాధించకపోయినా, పలువురి కోసం కృషి
- ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



బోధిస్తున్న శంకరాచారి

బెజ్జంకి(సిద్దిపేట): తాను సాధించకపోయినా తన తరఫున కొందరైనా ఆ లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు ఉచితంగా సివిల్స్‌లో శిక్షణ ఇస్తూ శభాష్ అనిపించుకున్నాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారోజు శంకరాచారి. సివిల్స్‌కు విద్యార్థులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలువురు విద్యార్థులకు సామాజిక మాధ్యమాల ద్వారా మెలకువలు నేర్పిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. బెజ్జంకి మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన శంకరాచారి సివిల్స్ కోసం చదివినా తృటిలో గ్రూప్–1 అవకాశం చేజారింది. తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 2002లో ఎంపికయ్యాడు. కరీంనగర్‌లో ఉంటూ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాడు. అయినా తృప్తి కలగకపోవడంతో డిగ్రీ చదివి సివిల్స్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులకు కొంత కాలంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు. సొంతంగా రూ.70 వేలు వెచ్చించి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. ప్రస్తుతం బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న శంకరాచారి 'నా గమ్యం ఐఏఎస్' అనే పుస్తకాన్ని ప్రచురించాడు. అప్పుడున్న పరిస్థితుల్లో తాను ఐఏఎస్ అయ్యి ప్రజలకు సేవలందించే అవకాశం రాకపోయినా, మరికొంత మంది విద్యార్థులను తీర్చిదిద్ది వారి ద్వారా ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మైనింగ్ కంపెనీలు సీజ్

- 79 వాహనాలకు రూ.22 లక్షల జరిమానా
- ఆర్డీఓ రవీందర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

సంగారెడ్డి: అక్రమ మైనింగ్ కంపెనీలు సీజ్ చేసి, అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించినట్లు మైనింగ్, చెరువుల సంరక్షణ కమిటీ కన్వీనర్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సంగారెడ్డి రెవెన్యూ డివిజినల్ పరిధిలో అక్రమ మైనింగ్, చెరువుల సంరక్షణ కమిటీతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సంగారెడ్డి డివిజినల్ పరిధిలో పటాన్‌చెరు మండలం లక్డారం, జిన్నారం మండలం ఖాజీపల్లిలో మొత్తం 78 మైనింగ్ కంపెనీలు ఉన్నాయన్నారు. ఇందులో ఐదు కంపెనీలు నిబంధనలకు లోబడి పని చేయపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. రవాణా శాఖ అధికారులు అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి 79 వాహనాలకు రూ. 22 లక్షలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కంపెనీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ మధుకుమార్ పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన స్థానం డైరెక్టర్ సురేశ్



తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిద్దిపేటఅర్బన్: ఆయిల్ పామ్ తోటల్లో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ సురేశ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రామచంద్రుడు రైతులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో రైతు ఎల్లాగౌడ్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేసి లాభాల బాటలో పయనించాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలకు తగినంత నీరు అందించాలని, సేంద్రియ, కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవడం ద్వారా తోట వృద్ధి బాగుంటుందని సూచించారు. చెట్లు నాటినప్పటి నుంచి 30 నెలల్లోపు చెట్లకు వచ్చే పూత, కాత తొలగించాలన్నారు. జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగులో ఉన్నాయని తెలిపారు. వచ్చే ఆగస్టు నెలలో 2500 ఎకరాల్లో పంట చేతికొస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సునీత, ఆయిల్ ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ వలలో ఉద్యోగులు

రూ.21.63 లక్షలు పోగొట్టుకున్న ఇద్దరు బాధితులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు నగదు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగినికి డిసెంబర్ 15వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. పెట్టిన నగదుకు కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితురాలు వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా రూ.15 లక్షలు పెట్టింది. కమీషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి జాబ్ ఆఫర్ అంటూ డిసెంబర్ 28వ తేదీన మెసేజ్ వచ్చింది. నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామని ఆశ చూపడంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి రూ.6లక్షల 63 వేలు పంపించాడు. తీరా పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో సైబర్ నేరగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీనే

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి
- నేటి కార్నర్ స్ట్రీట్ మీటింగ్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి

పటాన్‌చెరు టౌన్: గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో ఈసారి కూడా ప్రధాని మోదీనే అని, ఆయన ఆదేశాలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేపట్టిన రాజరాజేశ్వరి సంకల్పయాత్ర ఐదు క్లస్టర్లలో చేపట్టడం జరిగిందని జిల్లా భాజపా అధ్యక్షురాలు గోదావరి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్ పూర్తి చేసుకొని శుక్రవారం సాయంత్రానికి మెదక్ పార్లమెంటు పరిధిలోకి ప్రవేశించనుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల్లో భాజపాను గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. శుక్రవారం లింగపల్లి నుంచి బస్సు యాత్రకు స్వాగతం పలికి, పటాన్‌చెరులో కార్నర్ స్ట్రీట్ సమావేశం ఉంటుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరునాడు ఉదయం గణేశ్ గడ్డ దేవాలయంలో పూజలు చేసి సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రవేశిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కులకర్ణి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, మున్సిపల్ అధ్యక్షుడు ఆగారెడ్డి, గుమ్మడిదల మండలం కమిటీ అధ్యక్షుడు గోవర్దన్, అసెంబ్లీ మాజీ కన్వీనర్ నర్సింగరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముఠా గుట్టురట్టు

- ఇద్దరి అరెస్టు, వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ బాలాజీ



నిందితులతో ఏసీపీ బాలాజీ

వర్గల్(గజ్వేల్): వివిధ ప్రాంతాల్లో సెంట్రింగ్ బాక్సుల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును వర్గల్ మండలం గౌరారం పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని ఇద్దరు సభ్యులను అరెస్టు చేసి, 17 మందితో కూడిన ముఠా సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో అనేక నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ముఠాకు సంబంధించిన వివరాలను గురువారం గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద గజ్వేల్ ఏసీపీ బాలాజీ వెల్లడించారు. నల్గొండ జిల్లా పడమటి తండాకు చెందిన ముడావత్ హరి(28), దేవరకొండ, గాజీనగర్‌కు చెందిన జంపుల రాంలాల్(33), మరో 17 మంది సభ్యులు ముఠాగా సెంట్రింగ్ బాక్సుల చోరీకి పాల్పడుతున్నారు. కొన్ని రోజుల నుంచి సిద్దిపేట, మెదక్ జిల్లాలలో బాక్సులు చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏసీపీ బాలాజీ ఆదేశాల మేరకు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో గురువారం ఉదయం 6 గంటలకు గౌరారం ఎస్సై శివకుమార్ తన సిబ్బందితో కలిసి రాజీవ్ రహదారి వర్గల్ కమాన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి గౌరారం వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనంలో ముడావత్ హరి(28), జంపుల రాంలాల్(33) పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు అన్నీ బయటపడ్డాయి. వీరితోపాటు 17 మంది సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిని ఉంచి అశోక్ లేలాండ్ వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. సమావేశంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్సై శివకుమార్, ఏఎస్సై మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

- తూప్రాన్‌లో రెండు ఇళ్లలో దొంగతనం
- నగదు బంగారం అపహరణ
- మరో రెండు ఏటీఎంలో చోరీకి యత్నం

తూప్రాన్: తూప్రాన్‌లో దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలోని రెండు ఏటీఎంలు, రెండు తాళం వేసిన ఇళ్లలో గురువారం దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతరాజుపల్లిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో దొంగలు చోరీకి యత్నించారు. విద్యుత్ వైర్లు, సీసీ కెమెరా, అలారం వైర్లు కత్తిరించి వేశారు. కానీ ఎలాంటి నగదు పోలేదు. అలాగే, సమీపంలోని ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి నిందితుల వేలిముద్రలు సేకరిస్తున్న క్రమంలోనే మరో చోట చోరీ జరిగినట్టు సమాచారం వచ్చింది. పట్టణంలోని టాటా కాఫీ కాలనీలో నివాసం ఉంటున్న ఉమా రాణి ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తుంది. ఉదయం ఆమె పాఠశాలకు వెళ్లగా, భర్త తిరుమలరావు మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి వాహనంలో పెట్రోల్ పోసుకునేందుకు బయటకు వెళ్లాడు. అతడు తిరిగొచ్చేలోపే ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. వెంటనే తిరుమలరావు భార్యతోపాటు పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ అధికారులు శ్రీధర్‌గౌడ్, రమేశ్‌రెడ్డి ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. అలాగే బస్టాండ్ సమీపంలోని సుల్తానా ఇంట్లో రాత్రి తాళం పగులగొట్టి అర తులం బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



నిందితుల వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సిబ్బంది

అదృశ్యమై.. చెరువులో శవమై



డాకి రమేశ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): అదృశ్యమైన యువకుడు చెరువులో శవమై తేలాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన డాకి రమేశ్ (30) ఈ నెల 20వ తేదీన ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మరుసటిరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం మల్లె చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందని తెలియడంతో రమేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మృతదేహం రమేశ్‌దిగా గుర్తించారు. అప్పుల బాధతోనే రమేశ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేశారు.

మహిళ మృతదేహం లభ్యం

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు బావిలో పడిన మహిళ మృతదేహం లభ్యమైంది. ఏఎస్‌ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి అనిత (35) బుధవారం మేకలు మేపుతూ నీళ్ల కోసం వెళ్లి టేక్మాల్ శివారులోని పోత్రోపులోని బావిలో పడ్డ విషయం తెలిసిందే. అదే రోజు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం శవమై తేలింది. మృతురాలి భర్త కొండి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి జైలుకు..


- ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ఇద్దరు అరెస్టు
- నిందితులను పట్టించిన సీసీ కెమెరాలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: జల్సాలకు అలవాటు పడి.. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులు పోలీసులకు చిక్కి కటకటాలపాయ్యారు. మూడు రోజుల క్రితం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన వీరిని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను దుబ్బాక సీఐ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన రజినీకాంత్, గుర్రాల అనిల్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కొద్ది రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల కిందట (ఈ నెల 19న)మండలంలోని హబ్షీపూర్‌లో ఇండియా వన్ ఏటీఎంలో దొంగతనానికి యత్నించారు. వారు ఆయుధాలతో చోరీ చేస్తుండగా శబ్దం రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న దుబ్బాక పోలీసులు అక్కడికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం మోపారని ఆత్మహత్య



రాయగిరి(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కౌడిపల్లి మండలంలో గురువా రం వెలుగు చూసింది. ఎస్‌ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టాల గ్రామానికి చెందిన గుమ్మాల రాయగిరి (45), భార్య సుజాతలకు ముగ్గురు అమ్మాయిలు ఉండగా, చిన్న కూతురు భవానీని ఇంటి వద్దనే ఇల్లరికం పెట్టుకున్నాడు. అయితే, మనుమరాలి కడియాలు కనపడకపోవడంతో, వాటిని రాయగిరి దొంగిలించి అమ్ముకున్నాడని భార్య సుజాత తరచూ అతడితో గొడవ పడుతోంది. బుధవారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రాయగిరి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి పక్కనే ఉన్న గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న గుమ్మాల దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.